క్లుప్తంగా

చిన్న పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఐరాల: సమతుల ఆహారం అందిస్తే చిన్న పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప తెలిపారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్య సిబ్బంది ఫోర్ డీ(డిఫెక్ట్స్, డెఫిషియన్సీ, డిసీజెస్, డెవలప్మెంట్ డిలే) స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా కేంద్రాల పరిధిలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ప్రతి మూడు నుంచి నాలుగు రోజులకు ఒకసారి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల వయసుకు తగినట్టు ఎదుగుదల, రక్తహీనత, బరువు, బరువు తక్కువ ఉన్నవారికి, ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ బరువు లేని చిన్నారులకు పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయనున్నట్లు తెలియజేశారు. చిన్నారుల్లో ఏదైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వారిని పెద్ద ఆస్పత్రికి రిఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిట్టలను కాల్చి..



ప్లాస్టిక్ గన్‌తో పావురాలను వేటాడుతున్న షికారీలు

చిత్తూరు కార్పొరేషన్: నగర పరిధిలో షికారీలు ప్లాస్టిక్ గన్‌తో హల్‌చల్ చేస్తున్నారు. స్థానికంగా పలు వీధుల్లో నిషేధిత నల్లమందు తూటాలను అనుమతి లేని ప్లాస్టిక్‌గన్‌ను వాడుతున్నారు. దీంతో పావురాలు, అడవి పావురాలు, పిట్టలను కాపు కాసి కొట్టి బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గిరింపేట, దుర్గానగర్ కాలనీ, పీవీకేఎన్ కళాశాల సమీపంలో, రెడ్డిగుంట, మాపాక్షి, ప్రశాంత్‌నగర్, ఇరువారం ప్రాంతాల్లో ఎక్కువగా పక్షులను చంపుతున్నారు. వీటిని జత లెక్కన మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా వేదసభ



వేద సభలో మంత్రాలు పఠిస్తున్న పండితులు

కాణిపాకం : బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని కల్యాణ వేదికలో శనివారం వేద సభను ఘనంగా జరిపించారు. పలు దేవాలయాల నుంచి వచ్చిన వేద పండితులచే ఈ సభను నిర్వహించారు. సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవమూర్తుల వద్ద వేద ఘోష చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ పెంచల కిషోర్, డీఈఈ సాగర్‌బాబు, ఆలయ ఏఈఈ రవీంద్రబాబు అర్చకులు, పండితులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఐరాల సీడీపీఓ నిర్మల

తవణంపల్లె: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. తవణంపల్లె హైస్కూల్లో శనివారం సంకల్పం కార్యక్రమంలో బాలికలకు బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. బాల్య వివాహాలు గురించి కలిగే నష్టాలు గురించి వివరించారు. పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి బాలికలకు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, బాలికలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మామిడి లెక్క తేలేనా ?

తోతాపురి లెక్కల గోల్‌మాల్ బయటపడుతోంది. ఫ్యాక్టరీ యాజమాన్యాల లెక్కలు.. ర్యాంపు లెక్కలు జుట్టు పీక్కునేలా చేస్తున్నాయి. ఎలా చూసిన లెక్కల్లో తేడాలు కొడుతున్నాయి. బిల్లులపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ లెక్క తేల్చేందుకు అధికారులు, సిబ్బంది కుస్తీ పడుతున్నారు. మరోవైపు బిల్లుల కోసం మామిడి రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

- తోతాపురి మామిడికాయల తరలింపు లెక్కల్లో గోల్‌మాల్
- ఫ్యాక్టరీలకు తరలించిన కాయల బిల్లులపై అనుమానాలు
- తేలని ర్యాంపు లెక్కలు
- తలలు పట్టుకుంటున్న సిబ్బంది
- మరోవైపు బిల్లుల కోసం రైతన్నల ఎదురుచూపులు



మామిడి కాయలు (ఫైల్)

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి ఈ ఏడాది రైతులను ఢీలా పడేలా చేసింది. అధిక దిగుబడి ధరలను పతనం చేసింది. దీనిని అదునుగా చేసుకుని ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యాయి. తీరా జిల్లా యంత్రాంగం జోక్యం చేసుకుంది. ఫ్యాక్టరీలు మామిడిలో తోతాపురి రకం కాయలను కొనుగోలు చేసేలా చేసింది. ఇందుకు జిల్లాలోని 43 ఫ్యాక్టరీలో 31 ఫ్యాక్టరీలు కాయల కొనుగోలుకు ముందుకొచ్చింది. ఈ ఫ్యాక్టరీలు 49,350 మంది రైతుల నుంచి 2.31 లక్ష మెట్రిక్ టన్నుల కాయలను కొనుగోలు చేసింది. అలాగే ర్యాంపులు 30,600 మంది రైతులు 1.44 లక్ష మెట్రిక్ టన్నుల కాయలను ర్యాంపులకు తరలించినట్లు అధికారుల నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ నివేదికల పరిశీలనలో తారుమారు లెక్కలు తళుక్కుమంటున్నాయి.

పరిశీలనలో ఇలా..

కూటమి ప్రభుత్వం మామిడిలో తోతాపురి రకానికి కేజీకి రూ.12 మద్దతు ధర ప్రకటించింది. ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహక నిధి కింద రూ.4 చొప్పున అందిస్తామని ప్రకటించింది. దీంతో కొంతమంది మాయగాళ్లు మామిడి పేరుతో మోసానికి దిగారు. తమిళనాడు కాయలను తీసుకొచ్చి మాయగాళ్ల లెక్కల్లోకి దింపేశారు. కేవలం ప్రభుత్వం ఇచ్చే రూ.4 ప్రోత్సాహక నిధి కోసం ఇదంతా చేశారనే ఆరోపణలు అప్పట్లోనే గుప్పుమన్నాయి.

విస్తుగొలిపే నిజాలు వెలుగులోకి..

ఈ గోల్‌మాల్ దుమారం లేపడంతో అధికారులు జాబితా పరిశీలనకు దిగారు. 200 మంది సచివాలయ సిబ్బందిని రంగంలోకి దింపారు. వారి ద్వారా కాయల లెక్కలను పరిశీలిస్తున్నారు. ఇందులో విస్తుపోయే నిజాలు భయపడుతున్నాయి. మామిడి పంట లేకుండా కాయలు తోలిన వ్యక్తుల వివరాలు, ఒక ఎకరా మామిడి పంట ఉంటే..ఐదు ఎకరాల మామిడి కాయలు ఫ్యాక్టరీలకు తరలించినట్లు పరిశీలనలో సిబ్బంది గుర్తించినట్లు తెలిసింది. ఇలాంటి బోగస్ లెక్కలు చిత్తూరు, సదుం, పుంగనూరు, పలమనేరు, వీ.కోట తదితర ప్రాంతాల్లో అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అమ్మో ర్యాంపు లెక్కలే...

ర్యాంపు లెక్కలను చూసి పరిశీలనలో ఉన్న సిబ్బంది అవాక్కవుతున్నారు. లెక్కలు, బిల్లులు చూసి బిక్కమొహం పెడుతున్నారు. ఊరు, పేరు లేని ర్యాంపుల పేరుతో వచ్చిన బిల్లులను చూసి తలలు పట్టుకుంటున్నారు. వారు తోతాపురి కాయలు విక్రయించారా ? లేదా నీలం రకం కాయలు విక్రయించారా ? లేక ఏ రకమైన కాయలు తరలించారో అందులో లేదనే విషయాన్ని గుర్తించినట్లు సమాచారం. ఒకరి పేరుతో పలు బిల్లులు ఉండడంతో ఏ రకంగా వాటిని పరిశీలించాలో తెలియక కలవర పడుతున్నామని పలువురు చెబుతున్నారు. ఇలాంటివి బంగారుపాళ్యం, చిత్తూరు, పలమనేరు, వీకోట ప్రాంతాల్లో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. వీటిని ఏరకంగా పరిశీలించి..ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. పలుచోట్ల వీఆర్వోలు ఇచ్చిన లెక్కల్లో స్పష్టత లేదని పరిశీలన సిబ్బంది వాపోతున్నారు. ఈ ప్రక్రియ ఇలా ఉంటే.. కాయల కాసులు ఎప్పటికి చేతికొస్తాయో అని రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

గోసంరక్షణకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు శనివారం ఓ దాత నగదు విరాళం చేశారు. తిరుపతికి చెందిన దాత విజయదీపిక రూ.1.11 లక్షల నగదును విరాళంగా ఇచ్చుకున్నారు. ఆలయ అధికారులు దాత కుటుంబానికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



యోగసనాలు చేస్తున్న బృందావన్ పాఠశాల విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని బృందావన్ సీబీఎస్ఈ కళాశాల ప్రిన్సిపల్ శైలజాకుమారి అన్నారు. ఈ మేరకు కళాశాలలో శనివారం వార్షిక క్రీడా ఉత్సవాలు నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఎదుగుదలతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు విజయభాస్కర్, డైరెక్టర్ ప్రియతేజ, పలువురు టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



అవార్డు గ్రహీత అన్వర్ హుస్సేన్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఉర్దూ అధ్యాపకులు అన్వర్ హుస్సేన్ పొందడం అభినందనీయమని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఈ మేరకు శనివారం పీవీకేఎన్ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అవార్డు గ్రహీత అన్వర్ హుస్సేన్ తమ కళాశాలలో చదువుతున్న ఉర్దూ విద్యార్థుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఆయనకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం పీవీకేఎన్ కళాశాలకు గౌరవమని తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీతను దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిరంతర కృషితోనే లక్ష్యసాధన



బహుమతులు అందుకున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థి నిరంతర కృషితో లక్ష్యాన్ని సాధించవచ్చని ఆర్‌కే జూనియర్ కళాశాల కరస్పాండెంట్ బద్రీనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆ కళాశాల 19వ ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టేలా విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ప్రిన్సిపల్ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలన్నారు. తమ కళాశాలలో గత విద్యాసంవత్సరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ఉదయశ్రీ జాతీయ అవార్డు సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. అనంతరం 2024–25 విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ గుణశేఖర్, అధ్యాపకులు శ్రీరాములురెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి

– జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు



ప్రజా సమస్యలపై జెడ్పీ సీఈఓకి వివరిస్తున్న వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి

బంగారుపాళెం: గ్రామాల్లో సమస్యలపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపిస్తే ప్రజలు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. మురుగునీటి కాలువలు, చెత్తకుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వీధుల్లో, ఇళ్ల మధ్య మురుగు నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడాలన్నారు. తాగునీటి బోర్లు మరమ్మతులు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘ నిధులు పారిశుద్ధ్యం, తాగునీరు, పైపులైన్ మరమ్మతులు వంటి పనులకు మాత్రమే వినియోగించాలని సూచించారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఓ సుధాకర్‌రావు, ఎంపీడీఓ మహేష్, పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాప్రతినిధుల వినతి

మండలంలోని గ్రామాల్లో నెలకున్న సమస్యలపై ప్రజాప్రతినిధులు శనివారం జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడికి వినతిపత్రాన్ని అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, మండల విప్ హేమచంద్ర, కురబ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అమరనాథ్ గ్రామాల్లో నెలకొన్న వివిధ సమస్యలపై సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా ఎంపీటీసీ సభ్యులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని అందజేయాలన్నారు. గడిచిన నాలుగేళ్లకు గాను 11 నెలలకు మాత్రమే గౌరవవేతనం అందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాన్ని ఎంపీటీసీలకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటింటికీ వైద్యం.. అందరికీ ఆరోగ్యం



పైమాఘం గ్రామంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



టి.పుత్తూరులో..

తవణంపల్లె: ఇంటింటికీ వైద్యసేవలు కొనసాగుతున్నాయని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. శనివారం మండలంలోని పైమాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

టి.పుత్తూరులో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని టి.పుత్తూరులో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పది



జిల్లాస్థాయి ఉత్తమ ఎంఈఓగా అవార్డు పొందిన రుషేంద్రబాబును సన్మానిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

ఐరాల: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి తెలిపారు. శనివారం కాణిపాకం మోడల్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం మోహన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉత్తమ ఎంఈఓగా అవార్డు పొందిన మండల ఎంఈఓ రుషేంద్రబాబుకు సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా ఉత్తమ ఎంఈఓగా రుషేంద్రబాబుకు అవార్డు దక్కడం చాలా సంతోషకరమన్నారు. అనంతరం శాంతిసాగర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యాబోధన, ఆలోచనలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయని తెలిపారు. మంచి విద్యాబోధన, నడవడికతో సమాజంలో మంచి పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం ఎంఈఓను శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే హెచ్‌ఎంను సర్పంచ్, ఎంఈఓ, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిత, కవిత, విజయలక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ అరుణ పాల్గొన్నారు.

గురువులే దైవ స్వరూపులు



ఉపాధ్యాయ దినోత్సవంలో ఉపాధ్యాయులు

గుడిపాల: గురువులే దైవ స్వరూపులని ఎంఈఓ హసన్‌బాషా తెలిపారు. మండలంలోని నరహరిపేట హైస్కూల్‌లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే మొదటి ప్రాధాన్యత గురువులకే అన్నారు. సంస్కృత భాషలో గురువులు వారి బాధ్యతల గురించి ఎక్కువగా వివరాలు పొందుపరచినట్లు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉండి రాష్ట్రపతి పదవి వరకు ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణ ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

వైభవంగా వినాయక నిమజ్జనం





కె.పట్నంలో వినాయకున్ని నిమజ్జనానికి తరలిస్తున్న గ్రామస్తులు, బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె, బంగారుపాళెంలో శనివారం సాయంత్రం వినాయకుడి నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో వినాయకస్వామికి 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్ల తిరునాళ్ల నిర్వహించారు. పెద్దసంఖ్యలో యువకులు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం వినాయకుడి విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా వేడుకల నడుమ యువకులు నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తవణంపల్లె: మండలంలోని కె.పట్నంలో శనివారం సాయంత్రం వినాయకుడి ప్రతిమను భక్తితో ఊరేగింపుగా తీసుకెళ్లి గంగలో నిమజ్జనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. కె.పట్నంలో వినాయక చవితి సందర్భంగా వినాయకుడి ప్రతిమను ప్రతిష్ఠించి 11 రోజుల పాటు భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించారు. శనివారం ఓ భక్తుడు 7 కిలోల లడ్డూను స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిమజ్జనం సందర్భంగా యువకులు లడ్డూ వేలం వేయగా నిర్వహించారు. కె.పట్నంకు చెందిన జితేంద్ర రూ.23 వేలుకు దక్కించున్నాడు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

అమెరికా టారిఫ్‌లను వ్యతిరేకించండి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అమెరికా టారిఫ్‌ల పెంపును వ్యతిరేకించాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నాగరాజు, గంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గాంధీ విగ్రహం వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ప్రకటించడం అన్యాయమన్నారు. దీంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ట్రంప్ మిత్రుడని ప్రధాని మోదీ గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. పన్నులు పెంచుకుంటూపోతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయో జనాలు కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఏమాత్రం ప్రయత్నించకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, చంద్ర, రమాదేవి విజయ్, గౌరి, మనీ పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

వెదురుకుప్పం: వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులను సక్రమంగా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి అన్నారు. మండలంలోని పచ్చికాపల్లం పీహెచ్‌సీలో సిబ్బంది రోగులతో వ్యవహరిస్తున్న తీరుపై ఫిర్యాదు చేయడంతో శనివారం డీఎంఅండ్‌హెచ్ఓ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవలో పీహెచ్‌సీ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన చేశారు. దేవళంపేటలో పీహెచ్‌సీ మంజూరు చేయాలని స్థానిక నాయకులు ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఆమె వెంట వైద్యాధికారులు కృష్ణచైతన్య, చెంగారెడ్డి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

వెలుగుల్లేని దీపాలంకరణ

స్వర్ణరథ మండపంపై వెలగని లైటు



అగరంపల్లి ఆర్చి నుంచి దారిపొడవునా వెలగని లైట్లు



నూతన రోడ్డు మార్గంలో వెలగని లైట్లు



కాణిపాకం: బ్రహ్మోత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలంకరణ పలుచోట్ల మూగబోయింది. అగరంపల్లి ఆర్చ్ నుంచి దేవస్థానానికి వెళ్లే మార్గంలో అర కి.మీ మేర విద్యుత్ అలంకరణ వెలగడం లేదు. అదే దారిలో అక్కడక్కడ లైట్లు కోతలు పడ్డాయి. అలాగే నూతన రోడ్డులో కూడా లైట్లు వెలగట్లేదు. శ్రీస్వామి వారి స్వర్ణరథ మండపం, నక్షత్ర వనం, అతిథి భవన ప్రాంతాల్లో కూడా లైట్లు వెలగక చీకటి కమ్ముకుంది. వీటి నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. ఇందుకు రూ.లక్షల్లో వ్యయం చేస్తుంటే..అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.